ఆర్‌టిసి కార్గోకు రికార్డుస్థాయి ఆదాయం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఆర్‌టిసి కార్గో సర్వీసుకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సర ఆదాయం మార్చి నాటికి రూ.3.06 కోట్లు ఆర్జించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికే రూ.3.35 కోట్లను ఆర్జించినట్లు తెలిపారు. మరో మూడు నెలల సమయం ఉన్నందున మరింత ఆదాయం సమకూరనుందని పేర్కొన్నారు. పార్సిల్, కొరియర్స్, బల్క్‌లో రవాణాతో పాటు సర్వీసు బస్సుల్లో డిక్కీ స్పేస్, డిజిటి ద్వారా సరుకు రవాణా చేస్తున్నట్లు తెలిపారు. తక్కువ సమయంలోనే వినియోగదారుల సరుకులను గమ్యస్థానాలకు చేర్చడం వల్ల ఆర్‌టిసి కార్గోపై ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు. చిల్లర సమస్యను అధిగమించడానికి, చెల్లింపుల్లో మరింత పారదర్శకతకు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పారిశ్రామికం... నిరాశాజనకం

- ఏడాది కాలంలో ఒక్క పరిశ్రమా ఏర్పాటు కాని వైనం
- ఒడిదుడుకుల్లో గ్రానైట్, జీడి పరిశ్రమలు
- కార్మికులను ఏదో రూపంలో తొలగించేందుకు యాజమాన్యాలు ప్రయత్నం
- పెరిగిన కార్మికవర్గ పోరాటాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఈ ఏడాది కాలంలో జిల్లాకు పెద్దగా వచ్చిన పరిశ్రమలు గానీ, కార్మికులకు అదనంగా ఉపాధి కల్పించిన దాఖలాలు గానీ లేవు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలేవీ నేటికీ పట్టాలెక్కలేదు. మరోవైపు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా జ్యూట్, సింథటిక్ పరిశ్రమలు ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూతపడుతున్నాయి. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న జీడి పరిశ్రమలు నష్టాలను చవిచూస్తున్నాయి. సీనరైజ్ ఛార్జీలు, ఆన్‌లైన్ పద్ధతిలో లీజు కేటాయింపులతో గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోతోంది. పరిశ్రమల మూతతో కార్మికులు ఉపాధి కోల్పోతుంటే, కార్మికులతో పనిచేయించుకుంటున్న కొన్ని భారీ, మధ్యతరహా పరిశ్రమల యాజమాన్యాలు ఏదోరకంగా కార్మికులను ఇళ్లకు సాగనంపేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో ఈ ఏడాది కాలంలో కార్మిక వర్గ పోరాటాలూ పెరిగాయి.

జిల్లాలో ఈ ఏడాది కొత్తగా పరిశ్రమలు ఏర్పాటవుతాయని అంతా భావించినా అవి పట్టాలెక్కలేదు. రణస్థలం మండలం సంచాంలో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కలిగేది. రణస్థలం మండలం చిట్టివలసలో ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ఆసక్తి కనబరిచింది. పరిశ్రమ నెలకొల్పితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1500 మందికి ఉపాధి దొరికేది. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో ఎన్ఎసిఎల్ రసాయనిక పరిశ్రమ ఏర్పాటు చేసి ఉంటే 200 మందికి పనులు దొరికేవి. వీటితో పాటు శ్రీకాకుళం మండలం సింగుపురంలో అప్పో అథంటిక్ రాక్స్ 20 మందికి, రణస్థలం మండలం సిహెచ్.రాజాంలో రూ.4.51 కోట్లతో పరిశ్రమను ఏర్పాటు చేసి 70 మందికి ఉపాధి కల్పించేందుకు సిల్వర్‌మాంట్ ప్లే అండ్ వనీర్స్ లిమిటెడ్ ముందుకొచ్చింది. మధుకాన్ గ్రానైట్స్, శ్రీకేశవ స్టోన్ క్రషర్స్, గోల్డెన్ రాక్ కంపెనీ, పిఎస్ఎన్ రెడ్డి, ఎర్త్‌స్టోన్ ప్రయివేట్ లిమిటెడ్, ప్యూర్ మినరల్స్ తదితర కంపెనీలు అనుమతుల కోసం నిరీక్షిస్తున్నాయి.

పెరిగిన కార్మికవర్గ పోరాటాలు

ప్రభుత్వ విధానాలు, ముడిసరుకు దొరక్కపోవడం, విద్యుత్ ఛార్జీల భారంతో గ్రానైట్, జీడి, జ్యూట్, సింథటిక్ తదితర పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులు రోడ్డునపడుతున్నారు. మరోవైపు ఇప్పటివరకు ఉపాధి పొందుతున్న పరిశ్రమల్లో కార్మికులను ఏదో రూపంలో ఇంటికి సాగనంపేందుకు పలు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. కొన్నిచోట్ల వేతన ఒప్పందం అమలు చేయకుండా మొండికేస్తున్నాయి. రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం ప్రభుత్వం మద్యం ఆర్డర్లను తగ్గించిందనే పేరుతో పనిదినాలు తగ్గించేసింది. కొంతమందిని పనుల్లో నుంచి తొలగించింది. కార్మికులతో కలిసి సిఐటియు పలురూపాల్లో ఆందోళన చేపట్టడంతో యాజమాన్యం కార్మికులను పనిలోకి తీసుకోవడంతో పాటు రెండేళ్ల పాటు సంపాదిత సెలవులను మంజూరు చేసింది.

శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పెండింగ్ బోనస్, వేతన బకాయిల కోసం నిరసన తెలిపిన కార్మికులను యాజమాన్యం 2012 నవంబరులో 570 మందిని నిలిపేసింది. యాజమాన్యం తీరుపై కార్మికులు తీవ్ర పోరాటం సాగించారు. అరబిందో ఫార్మా వేతన ఒప్పందం అమలు చేసేందుకు మొండికేస్తోంది. అధికారంలో వైసిపి ప్రభుత్వం అండతో కార్మిక చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. క్రమశిక్షణ పేరుతో 200 మంది కార్మికులను తొలగించడంతో పాటు వేధింపులకు పాల్పడుతోంది. అక్రమ కేసులు బనాయిస్తోంది. యూనియన్ విచ్ఛిన్నానికి రకరకాల ప్రయత్నాలు సాగిస్తోంది. అక్రమ కేసులు, వేధింపులు, తొలగింపులకు వెరవకుండా కార్మికుల పోరు సాగిస్తూనే ఉన్నారు. నాగార్జున అగ్రికెమ్‌లో వేతన ఒప్పందం విషయంలో యాజమాన్యం కూడా అనేక షరతులు విధించింది. కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను అమలు చేయడానికి నిరాకరించిన స్మార్ట్‌కెమ్ పరిశ్రమ కార్మికుల ఆందోళనలతో దిగొచ్చింది. సమస్యల పరిష్కారం కోరుతూ స్కీమ్‌వర్కర్లు, ఇతర రంగాల కార్మికులూ పలు ఆందోళనలు చేపట్టారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

సంక్షోభంలో గ్రానైట్

జిల్లాలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నష్టాలను చవిచూస్తున్నాయి. ప్రభుత్వం పెంచిన సీనరైజ్ ఫీజు భారంతో పాటు డీజిల్ ధరలు పెరగడం పరిశ్రమకు గుదిబండగా మారింది. ఉత్పత్తి ఖర్చులు అధికంగా పెరగడంతో యాజమాన్యాలు ఉత్పత్తిని తగ్గించడమో, మూసివేయడమో చేస్తున్నాయి. మరోవైపు లీజు అనుమతుల కాలం ముగియడం, ఆన్‌లైన్ విధానంలో క్వారీ లీజులు కేటాయించడంతో పరిశ్రమ యాజమాన్యాలు చేతులెత్తేశాయి. ఫలితంగా గ్రానైట్ పరిశ్రమకు అనుబంధంగా ఉన్న పాలిషింగ్ యూనిట్లు మూతపడుతుండడంతో కార్మికుల ఉపాధికి గండి పడింది.

నష్టాలబాటలో జీడి పరిశ్రమ

ప్రపంచీకరణ, స్వేచ్ఛా వాణిజ్య విధానం ఫలితంగా పలాస జీడి పరిశ్రమను సంక్షోభ పరిస్థితులు చుట్టుముడుతున్నాయి. దక్షిణాఫ్రికా నుంచి ఇక్కడకు జీడిపప్పు దిగుమతి అవుతుండడంతో ఇక్కడి పప్పుకు డిమాండ్ తగ్గింది. స్వచ్ఛమైన తెలుపు రంగుతో పాటు పప్పు నాణ్యంగా ఉండడంతో అక్కడి పప్పుకు డిమాండ్ పెరిగింది. పైగా తక్కువ ధరకే లభిస్తుండడంతో, ఇక్కడి పప్పు అమ్మకాలపై ప్రభావం చూపుతోంది. దక్షిణాఫ్రికా నుంచి దొరుకుతున్న జీడిపప్పు 80 కేజీల బస్తా రూ.9,400 నుంచి రూ.9,600కే లభిస్తోంది. ఇక్కడ పప్పును రూ.పది వేలకు అమ్మితే గానీ గిట్టుబాటు కావడం లేదు. అమ్మకాలు లేక ఈ ఏడాది కాలంలో 60 యూనిట్ల వరకు మూతపడినట్లు తెలుస్తోంది.

నేడు కార్మిక చైతన్య బస్సు యాత్ర

- మందసలో ప్రారంభ సభ
- హాజరు కానున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, మందస

ఏలూరు జిల్లా భీమవరంలో జనవరి 2 నుంచి నాలుగో తేదీ వరకు నిర్వహించే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభల సందర్భంగా చేపడుతున్న కార్మిక చైతన్య బస్సు యాత్ర బుధవారం మందసలో ప్రారంభం కానుంది. విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వేలు, పోర్టులు, బ్యాంకులు తదితర ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం ఆపాలనే డిమాండ్లతో పాటు కార్మిక హక్కుల రక్షణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం తదితర నినాదాలతో యాత్ర కొనసాగనుంది. మందసలో తొలుత వీరగునమ్మ స్థూపానికి నివాళ్లు అర్పించిన అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ఉపాధ్యక్షులు బేబీరాణి తదితరులు ప్రసంగించనున్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.గణపతి, కె.కేశవరావు, ఆర్.దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. యాత్ర కరపత్రాన్ని మందసలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై దాడి చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయని, ధరలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు బాలకృష్ణ, లచ్చయ్య, మడ్డు ధర్మారావు, రైతుసంఘం మండల కార్యదర్శి ఎం.ధర్మారావు పాల్గొన్నారు.

యాత్ర షెడ్యూల్ ఇలా...

ఉదయం 9 గంటలు : మందసలో వీరగున్నమ్మ స్థూపానికి నివాళి, హైస్కూల్ నుంచి ర్యాలీ
10 గంటలు : మందస బస్టాండ్‌లో బహిరంగ సభ
12 గంటలు : కాశీబుగ్గ బస్టాండ్‌లో సభ
1.30 గంటలు : కోటబొమ్మాళి మండలం కొత్తపేట కూడలి వద్ద సభ
4.30 గంటలు : ఏడు రోడ్ల కూడలి వద్ద సభ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

చివరి గింజ వరకు కొనుగోలు

- ఇప్పటివరకు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ.13.47 కోట్లు జమ
- తప్పులు జరిగితే బాధ్యులపై చర్యలు
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 21,351 మంది రైతుల నుంచి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి గానూ ఇప్పటివరకు రూ.13.47 కోట్లు చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మిగిలిన వాటికి ప్రతి బుధ, గురువారాల్లో చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. వీటితో పాటు రూ.11 లక్షలు గోనె సంచులకు, రూ.ఐదు లక్షలు రవాణా ఛార్జీలకు చెల్లించామని, త్వరలో హమాలీల ఛార్జీలనూ చెల్లిస్తామన్నారు. ఈ ఏడాది పంట దిగుబడి బాగుండడంతో ఇతర జిల్లాలు, ఒడిశా నుంచి దిగుమతి చేసుకునే అవకాశం లేదన్నారు. ఇక్కడి ధాన్యాన్నే వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇతర జిల్లాల నుండి దిగుమతి చేసుకోకుండా ఉండేలా విజిలెన్స్, పోలీసు శాఖలను అప్రమత్తం చేశామన్నారు. సేకరిస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నామని, ఎక్కడ ఎటువంటి పొరపాటు జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, పౌరసరఫరాల శాఖ అధికారి డి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

ఉప్పు భూములకు లీజు కాలానికి పరిహారం

- భూముల స్వాధీనానికి ప్రభుత్వ నిర్ణయం
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కేంద్ర ప్రభుత్వం ఉప్పు రైతులకు లీజు ప్రాతిపదికన కేటాయించిన భూముల లీజు ముగింపునకు గడువు ఉన్నందున ఆ కాలానికి తగిన నష్టపరిహారం చెల్లిస్తామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హామీనిచ్చారు. భావనపాడు పోర్టు కోసం ఉప్పు భూముల స్వాధీనంపై ఉప్పు కర్మాగారాల యాజమాన్యాలు, రైతులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు ఐదు వేల ఎకరాల భూములను ఉప్పు కర్మాగారాల కోసం కేంద్ర ప్రభుత్వం లీజుకు కేటాయించిందన్నారు. ఇందులో 2,186 ఎకరాల్లో పరిశ్రమలు ఉండగా, అందులో 800 ఎకరాల్లో మాత్రమే ఉప్పు సాగవుతోందని తెలిపారు. ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి తీసుకునేందుకు నిర్ణయించిందన్నారు. ఈ మేరకు సాల్ట్ ఇండస్ట్రీస్ కమిషన్‌కు కేంద్ర ప్రభుత్వం లేఖ రాసిందని తెలిపారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేశామని, భూముల లీజు కాలం ముగిసేందుకు ఇంకా కొంత గడువు ఉన్నందున ఆ కాలానికి నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్నందున ఆ భూములు తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఎటువంటి పరిహారం చెల్లించబోమని స్పష్టం చేశారు. లీజుకు సాగు చేస్తున్న భూములపై రైతులకు హక్కులు ఉండబోవన్నారు. లీజు ఉన్న సమయాన్ని లెక్కించి రైతుల నుంచి ఎన్ఒసి తీసుకున్న తర్వాత పరిహారం చెల్లిస్తామని చెప్పారు.

జిల్లాలో ఉప్పు ఉత్పత్తులు గణనీయంగా ఉన్నాయని, ఎకరానికి, ఏడాదికి ఎంతమేర నష్టపరిహారం చెల్లించాలో పరిశీలించాలని ఉప్పు పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. సాంకేతికంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అందరికీ సమన్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు ఒక బృందంగా ఏర్పడి నివేదికలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, భావనపాడు పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ టి.ఎస్.ఎన్ మూర్తి, డిప్యూటీ సాల్ట్ కమిషనర్ వి.ఆనంద్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ ఎ.వెంకటరావు, నౌపడ సాల్ట్ ఫ్యాక్టరీ ఆఫీసర్ నాజ్రుల్ ఇస్లాం, తహశీల్దార్ చలమయ్య, పలు సాల్ట్ కంపెనీల ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, భానోజీరావు, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుకు చర్యలు తీసుకోవాలి

ఎంపీ రామ్మోహన్ నాయుడును కోరిన టోల్‌ప్లాజా కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్‌హెచ్ అధికారులతో చర్చించి మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకోవాలని చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులు ఎంపీ రామ్మోహన్ నాయుడును కోరారు. సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎచ్చెర్ల మండలంలోని చిలకపాలెం టోల్‌ప్లాజాను ఎత్తివేసి ఇక్కడి ఆదాయాన్ని నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు, 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏ విధంగా బతకాలని ప్రశ్నించారు. ఇక్కడ పనిచేస్తున్న 106 మంది కార్మికులను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో ఉద్యోగాలు కల్పించాలని, గ్రాట్యూటీ, నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి నేషనల్ హైవే అధికారులకు లేఖ రాస్తానని హామీనిచ్చారు. దేశం కోసం సరిహద్దుల్లో కాపలా కాసిన మాజీ సైనికులకు న్యాయం చేకూరే వరకు అండగా నిలుస్తానని భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీని కలిసిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వి నర్సింహులు, ఎ.వి.ఆర్ మూర్తి, ఎం.శంకరనారాయణ, పి.రాము తదితరులున్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఆరోగ్యంపై మరింత శ్రద్ధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని స్పందన హాలులో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ ఉద్యోగులకు రక్త పరీక్షల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఉద్యోగులు విధులతో పాటు వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.రాజేశ్వరి, పలు శాఖల అధికారులు, సిబ్బంది రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, అర్బన్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ జె.కృష్ణమోహన్, డిఎస్ఒ డి.వెంకటరమణ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

3 నుంచి సిక్కోలు డ్వాక్రా బజారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జనవరి 3 నుంచి తొమ్మిదో తేదీ వరకు నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో సిక్కోలు డ్వాక్రా బజారును నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డి.వి విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం పది నుంచి రాత్రి 9.30 గంటల వరకు డ్వాక్రా బజారు తెరిచి ఉంటుందని పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పలు వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించనున్నట్లు తెలిపారు.

30న జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా వంద రోజుల పాటు శిక్షణ, ప్రొడక్షన్ కెమిస్ట్ ఉద్యోగాల్లో నియమించనున్నట్లు పేర్కొన్నారు. నోడల్ జెకెసి కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో రెడోక్స్ లేబొరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా సుమారు 150 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో పనిచేయడానికి బిఎస్‌ఇ (కెమిస్ట్రీ), డిప్లమా, బిఫార్మా పూర్తి చేసిన 23 ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 94909 44803, 79817 81076 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM
E.P. No.36/2017 in A.A. No.779/2011

Between: M/s. Shriram Transport Finance Company Ltd., Narasannapeta Branch, Rep. by its Power of Attorney Holder Sri. Bonu Venkata Ravi Sankar. ... DHR
And:
1. S.Tavitinaidu
2. B. Satyam ...JDRS
To
1. **S. Tavitinaidu,** s/o Bhusayya, aged 46 years, D.No. 1-14, Bodlapadu Colony, Vykuntapuram Village, Burja Mandal, Srikakulam District.
2. **B.Satyam**, s/o Appa Rao, aged 42 years, D.No. 2-38, Korlakota Main Road, Amadalavalasa Mandal, Srikakulam District

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై నెంబరు అవార్డు సొమ్ము రాబట్టే నిమిత్తము శ్రీ రామ్ పోర్ట్ టౌరాన్స్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, నరసన్నపేట శాఖ వారు E.P అమలుపరచి యున్నారు. పై కోర్టు వారు అమలు నిమిత్తం దిగువ షెడ్యూల్ గల ఆస్తిని వేలం వేయడానికి ఆర్డర్ వేసి యున్నారు. కావున దిగువ గల షెడ్యూల్ అస్తినకుబహిరంగముగా వేలం వేయబడును. పై కోర్టులో తేది **18/01/2023 ఉ: 10:30 నిమిషాల నుండి సా:5:00 గంటల** మధ్యకాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున ఆసక్తిగల ఆసాములు బహిరంగముగా వేలం లో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY OF JDR-1

District:-Srikakulam,Sub- Division:- Srikakulam,S.R.O.:-Amadalavalasa,Panchayat Vykuntapuram, village, Vykuntapuram, Nature of Property:-Wet Land
Survey No.20/1,2,3,4,6,7, 84/1,5,6,24/7,8,9,11,16,20,25/5,6,7,10,11, 12,13,15,16,17,18,20, 27/12,15,16,23, 28/1,29/1,2, 30/20, 37/8,39/10, 44/7, 47/4, 47/22, 69/33, 34, 74/1,2, 72/1
Total Extent :- AC 8.32 cents with following

BOUNDARIES:
EAST : - All full extents
WEST:- All full extents
SOUTH: - All full extents
NORTH :- All full extents

P.V. RAMANA DAYAL
Advocate,
Illispuram,SRIKAKULAM-532 001,
Cell No. 9849171366.

అర్హులు నష్టపోకూడదు

- ప్రతి ఆరు నెలలకు సంక్షేమ పథకాల లబ్ధి
- 8,370 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10.73 కోట్లు జమ
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంక్షేమ పథకాల్లో అర్హులెవరూ నష్టపోకూడదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో అర్హత కలిగిన 8,370 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10.73 కోట్లను జమ చేయనున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాల అమల్లో అర్హత కలిగి పలు కారణాలతో లబ్ధి పొందని వారందరికీ తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో ఆధార్ లింక్ కాకపోవడం, విద్యుత్ బిల్లు, సొంత భూములు ఎక్కువగా కలిగి ఉండడం తదితర సాంకేతిక కారణాలతో లబ్ధి పొందని వారికి ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు లబ్ధిని చేకూరుస్తుందని తెలిపారు. జగనన్న చేదోడు, కాపునేస్తం, అమ్మఒడి, రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ పంట రుణాలు ఇలా అన్ని పథకాల్లో అర్హత కలిగి లబ్ధి పొందని వారికి మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉండి లబ్ధి పొందని వారు ఉంటే సమీప సచివాలయంలో దరఖాస్తును సమర్పించాలన్నారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, ఇతర అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అర్హతే ప్రామాణికంగా పథకాలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తండ్యాం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను డిబిటి విధానం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా తండ్యాం పంచాయతీ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీ, గూనానపేటలోని ప్రాథమిక పాఠశాలల్లో సుమారు రూ.24 లక్షలతో మనబడి నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.16 లక్షలతో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.12 లక్షలతో పూర్తయిన ఇంటింటా మంచినీటి కుళాయిలను ప్రారంభించారు. సుమారు రూ.1.10 కోట్లతో తండ్యాం నుంచి గూనానపేట వరకూ బిటి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన యాదవులకు 20 శాతం సబ్సిడీతో గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి ఛైర్మన్ బాడాన సునీల్‌కుమార్, ఎంపిటిసి వి.పార్వతి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, నాయకులు వి.మోహన్, గూనాన కృష్ణ, మీసాల రమణ, కిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com


పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

నియోజకవర్గంలో అన్ని అర్హతలు కలిగి ఉన్న నిరుద్యోగులకు రెడ్డీస్ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కంపెనీ ప్రతినిధులకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ కంపెనీలో రెడ్డీస్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నిరుద్యోగ సమస్య ప్రధానంగా ఉందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిరుద్యోగ సమస్య తన దృష్టికి వచ్చాయని చెప్పారు. నియోజకవర్గంలో అధికంగా కంపెనీలు ఉన్నాయని, ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. జనవరి నాటికి అర్హులకు ఉద్యోగాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, లావేరు ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సంచాం సర్పంచ్ రెడ్డి రాము, పైడిభీమవరం ఎంపిటిసి ఆకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం: సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లో తీసుకెళ్లాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. వైసిపి సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అధ్యక్షతన పట్టణంలోని సచివాలయం కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించడంతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లే ప్రధాన భూమిక పోషించాలన్నారు. వాలంటీర్లపై పనిభారం తగ్గించాలనే ఉద్దేశంతో సిఎం కొత్తగా సచివాలయ కో-ఆర్డినేటర్లను నియమించిందన్నారు. సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు నర్తు రామారావు, సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, డుక్క లోకేశ్వరరావు, లాభాల స్వర్ణమణి, తాడి ఆదిరెడ్డి, సాలీనా ఢిల్లి, సయ్యద్ సుల్తాన్, ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్

పొందూరు: మండలంలోని రాపాక సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, ఫోన్ నంబరు లింక్, అడ్రస్‌లో మార్పులు, పేరు మార్పిడీలను చేపట్టారు. అలాగే ఈ నెల 28న కింతలి, రాపాక, 29న కనిమెట్ట, మలకాం, 30న తోలాపి, తండ్యాం సచివాలయాల్లో ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నారు. డిజిటల్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, సచివాలయం సిబ్బంది మహాలక్ష్మి, అప్పన్న, చక్రి తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న అధికారులు

ముమ్మరంగా సిసి రోడ్డు పనులు

బూర్జ : మండలంలో తుడ్డలిలో సిసి రోడ్డు పనులు ముమ్మరంగా చేపడుతున్నామని సర్పంచ్ అంపిలి రూపవతి తెలిపారు. ఈ మేరకు సిసి రోడ్డు పనులను ఎఇ మౌనిక, ఇంజినీరింగ్ అసోసియేషన్ వరప్రసాద్‌తో కలిసి మంగళవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వీరి వెంట సర్పంచ్ ప్రతినిధి గణపతిరావు ఉన్నారు.

కళ్లాల్లో ధాన్యం... కళ్లల్లో దైన్యం

- బ్యాంకు గ్యారంటీ లేదంటున్న మిల్లులు
- ప్రకటనలకే పరిమితమైన వైనం
- నామమాత్రంగా ఆర్‌బికెలు
- నిర్వేదంలో రైతులు

ప్రజాశక్తి- కవిటి

కవిటికు చెందిన వజ్జ జయ ప్రకాష్ ఐదెకరాల్లో వరి పండించాడు. ప్రకృతి సహకరించడంతో దిగుబడి బాగానే వచ్చింది. ధాన్యం అమ్మి పంట కోసం చేసిన అప్పుతీర్చి, పండగ ఖర్చులు చేద్దామని అనుకున్నాడు. కానీ, 20 రోజులుగా అదిగో ఇదిగో అంటున్నారే తప్ప ధాన్యం మాత్రం పట్టుకువెళ్లడం లేదు. దీంతో ఎదురుచూపులే మిగిలాయి. ఇది కేవలం జయప్రకాష్ ఒక్కడి పరిస్థితి మాత్రమే కాదు. మండలంలో వరి పండించిన రైతులందరి పరిస్థితి.

ఓ వైపు పండగ తరుముకొస్తుంటే.. మరోవైపు కల్లాల్లో ధాన్యం చూస్తున్న రైతుకి కళ్లల్లో నీరు సుడులు తిరుగుతున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ నాయకుడు అధికారంలో ఉన్నా మాదంతా రైతు కుటుంబమే అని చెబుతున్నారు. కానీ, వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. వాతావరణం బాగుంది కాబట్టి పర్వాలేదు అదే ఒక్క వర్షపుజల్లు పడినా తమ పరిస్థితి ఏంటని, అప్పుడు తమను ఆదుకునేవారు ఎవరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల నడుమ గత 20 రోజులుగా ఎప్పుడెప్పుడు తమ ధాన్యం పట్టుకెళ్తారని కళ్లల్లో ఒత్తులు వేసుకుని మరీ చూస్తున్న మండలం ఖరీఫ్ రైతులే దీనికి ఉదాహరణ.

మండలంలో 2913 ఎకరాల్లో రైతులు వరి పండించారు. సుమారుగా 6292 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ, ఇప్పటి వరకూ కేవలం 4.8 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. దీనంతటికీ అందుబాటులో ఉన్న మిల్లు ట్యాగ్ అవ్వకపోవడమే కారణమని ఇటు రైతులు, అటు అధికారులు అంటున్నారు. వాస్తవానికి ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్రకి చెందిన మిల్లుని కవిటి పిఎసిఎస్‌కు ట్యాగ్ చేశారు. కానీ, అప్పటికే ఇచ్ఛాపురం మండలానికి చెందిన రైతులు ఆ మిల్లుకి ధాన్యం తరలిస్తుండడంతో అక్కడ రద్దీ ఎక్కువైంది. కవిటి నుంచి వెళ్లిన ఒక్కలోడు దించేందుకే అక్కడ రోజంతా పట్టింది. ఈలోగా మిల్లు బ్యాంకు గ్యారంటీ కూడా పూర్తయిపోయింది. దీంతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోయాయి. ఇక అధికారులకు ఒత్తిడి ఎక్కువ అవడంతో మంగళవారం టెక్కలి మిల్లు ట్యాగ్ చేశారు. ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర గ్రామమే దురమంటే... ఇప్పుడు టెక్కలి యాడ్ చేశారు. తప్పని పరిస్థితుల్లో ట్రక్ షీట్లు తీస్తున్న వ్యవసాయ, పిఎసిఎస్ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

సోంపేట, కంచిలిలో..

సోంపేట, కంచిలి మండలాల్లో ఎనిమిది రైస్ మిల్లులు ఉన్నాయి. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటే కవిటి, సోంపేట, కంచిలి మండలాల ధాన్యం ఒక్క గింగా మిగలదు. కానీ, కవిటి మండలానికి వాటిని ట్యాగ్ చేయడం లేదు. ఏమంటే వాటికి బ్యాంకు గ్యారంటీ లేదని అంటున్నారు.

ముందస్తు జాగ్రత్తలు లేక..

డిసెంబరు మొదటి వారం నుంచే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిసీ తగిన చర్యలు తీసుకోపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సోంపేట, కంచిలి మండలాలకు చెందిన మిల్లులు ట్యాగ్ చేస్తే ఇంత సమస్య ఉండేదికాదని, కేవలం అలసత్వం, నిర్లక్ష్యమే ప్రధాన కారణమని వీరు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఇప్పుడు కంచిలి, సోంపేట మిల్లు ట్యాగ్ చేసినా ఆన్‌లైన్‌లో ఎ మిల్లు చూపిస్తే అక్కడకే ధాన్యం తరలించాలని, దీంతో ముచ్చింద్ర మిల్లు కూడా ఆన్‌లైన్‌లో చూపించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే మళ్లీ కొనుగోళ్ల ఆలస్యం అవుతుందని రైతులు అంటున్నారు. దీంతో ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా రైతుల పరిస్థితి ఏర్పడింది.

తేమ పేరుతో..

మరోవైపు ధాన్యంలో తేమ శాతం ఎక్కువ ఉందని, ధాన్యం ఆరబెట్టాలని వ్యవసాయ సిబ్బంది రైతులకు చెబుతున్నారు. వాస్తవానికి 20 రోజులుగా అన్ని పనులు చేసి ఎదురుచూస్తున్న రైతుకి ఇదో అదనపు భారం. ఎందుకంటే ప్రతి రైతూ నాణ్యమైన సరుకునే అందివ్వాలని ఆశిస్తాడు. కానీ, విపరీతంగా కురుస్తున్న మంచు, వీస్తున్న చలి గాలులకు ధాన్యంలో కొంతవరకు తేమ ఏర్పడుతోంది. మళ్లీ ఎండ వచ్చిన తరువాత పరిస్థితి మారుతోంది. దీంతో ధాన్యం ఎండబెట్టెందుకే కొంతమంది రైతులకు రూ.500 నుంచి రూ.3000 వేల వరకు ఖర్చు అయిందంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది. అదే ఈపాటికే ధాన్యం కొనుగోలు జరిగి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు అంటున్నారు.

ధాన్యం రాశులు

15 రోజులుగా ఎదురుచూస్తున్నా

నేను 1.43 ఎకరాల్లో వరి పండించాను. పెరిగిన ధరల నేపథ్యంలో నాకు సుమారు రూ.38 వేలు వరకు ఖర్చు అయింది. సుమారుగా 35 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. అయితే గత 15 రోజులుగా కల్లంలో ధాన్యం వేసుకుని కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాను. ఈ రోజు, రేపు అంటున్నారు. ధాన్యం మాత్రం వెళ్లడం లేదు. భవిష్యత్‌లో పంట పండించాలంటేనే భయంగా ఉంది.

\- ఆరింగి శ్రీను, రైతు, కవిటి

రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు

కొన్ని మిల్లుల బ్యాంకు గ్యారంటీ అయిపోవడంతో ప్రస్తుతానికి టెక్కలి మిల్లు ట్యాగ్ చేశారు. మండలంలో ధాన్యం పరిస్థితి, మిల్లుల పరిస్థితి ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఇప్పటికే సిబ్బంది రైతుల వద్దకు వెళ్లి ధాన్యం తేమ శాతం చూసి, అన్నీ సిద్ధం చేసి ఉంచారు. మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేస్తాం.

\- ఆర్.అప్పలరాజు, తహశీల్దార్

ఎంపీ దృష్టికి క్రీడాకారుల సమస్యలు

వినతిపత్రం అందజేస్తున్న క్రీడాకారులు

శ్రీకాకుళం అర్బన్ : గ్రామీణ క్రీడగా గుర్తింపు పొందిన బాల్ బ్యాడ్మింటన్‌కు భారత క్రీడా సమాఖ్య గుర్తింపును కొనసాగించాలని బాల్ బ్యాడ్మింటన్ జిల్లా క్రీడాకారుడు, కోచ్ ఎం.మధుసూదనరావు కోరారు. నగరంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చెందిన చెందిన జె.పిచ్చయ్యకు (వరంగల్) ప్రప్రథమంగా 1970లో భారత ప్రభుత్వం అర్జున అవార్డును ప్రధానం చేసిందని గుర్తు చేశారు. 1962 నుంచి 2021 వరకు భారత క్రీడా సమాఖ్యలో కొనసాగిన గుర్తింపును ఈ ఏడాది పెండింగ్‌లో ఉంచడంతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జిల్లావ్యాప్తంగా 1,800 మంది క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తున్నారని, వందలాది మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారని వివరించారు. ఈ నెల 24 నుంచి 28 వరకు కేరళలో 68వ జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. త్వరలో రాష్ట్రంలో ఏషియన్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ నిర్వహించనున్నారని వివరించారు. 8 దేశాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఇటువంటి బాల్ బ్యాడ్మింటన్ క్రీడను జాతీయ క్రీడల్లో చేరిస్తే పూర్వ వైభవం సాధించడానికి దోహదపడుతుందన్నారు. క్రీడాకారులకు రైల్వే ప్రయాణాల్లో రాయితీని పునరుద్ధరించాలని కోరారు. ఎంపీ మాట్లాడుతూ భారత యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లి క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మి, శ్రీపురం యూత్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రుప్ప రమణమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులు నరసింహనాయుడు, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసంపై ఫిర్యాదు

కొత్తూరు: తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ కొప్పల బాలకృష్ణ తనను ప్రేమ పేరుతో మోసగించారని మండలంలోని కర్లెమ్మ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న రత్నాల లక్ష్మీకళ్యాణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే... పాతపట్నం మండలం తిడ్డిమి కాలనీకి చెందిన డిటి బాలకృష్ణ కొత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. లక్ష్మీకళ్యాణం ఆర్‌బికెలో వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తుంది. లక్ష్మీకళ్యాణికి తండ్రికి 2019లో కరోనా సోకడంతో వైద్యం చేయిస్తున్న సమయంలో డిటి పరిచయమయ్యారు. ఆ సమయంలో డిటి ఆమెకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించారు. అనంతరం వారి మధ్య పరిచయం కాస్త ఎక్కువైంది. విషయం తెలుసుకున్న డిటి భార్య గీత ఈ నెల 26న లక్ష్మీకళ్యాణికి ఫోన్ చేసి మందలించింది. మంగళవారం నేతాజీనగర్ కాలనీలో పెళ్లయిందన్న విషయం ఎందుకు చెప్పలేదని, మరి నా సంగతి ఏమిటని డిటిని నిలదీసింది. డిటి నాకు పెళ్లయింది, నిన్ను పెళ్లి చేసుకోనని చెప్పి నిరాకరించారు. అలాగే ఆ సమయంలో డిటి భార్య గీత వచ్చి లక్ష్మీకళ్యాణికి కొట్టింది. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ గోవిందు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టాయని లబ్ధిదారులు ఆరోపించారు. పలాస కాపువీధిలో రేషన్ డిపో (135)ను భాను ప్రసాద్ నడుపుతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్ బియ్యాన్ని డిపోలకు అందజేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, డీలరు పంపిణీ చేయకుండా నాలుగు రోజుల కింద డిపోకు తాళం వేసి వేశాడు. రోజూ కార్డుదారులు వచ్చి చూసుకుని వెళ్లిపోతుండేవారు. అన్ని డిపోల్లో ఉచిత బీమా పంపిణీ చేస్తుంటే, ఈ డిపోల మాత్రం బియ్యం పంపిణీ చేయకపోవడంతో అనుమానం వచ్చింది. దీంతో డిపో డీలర్‌ను నిలదీశారు. డీలర్ సరైన సమాధానం చెప్పకపోవడంతో సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ నలిని సమాచారం అందజేశారు. వెంటనే డిపో వద్దకు చేరుకుని పరిశీలించారు. 74 బస్తాలకు 36 బస్తాలే పంపిణీ చేశారని, మిగిలిన బస్తులు ఏమి అయ్యాయని డీలర్‌ను ప్రశ్నించారు. డీలర్ స్పందిస్తూ... ప్రతినెలా సకాలంలో సరఫరా చేస్తున్నానని, బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తానని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మృతి

ప్రజాశక్తి- నౌపడ

విశ్వేశ్వరరావు (ఫైల్)

సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురానికి చెందిన పొందల విశ్వేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఈయన వైసిపి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి పనిచేస్తున్నారు. ఈయన మృతిపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి రాజేశ్వరి, వైస్ ఎంపిపి ప్రతినిధి రామకృష్ణ, కోత సతీష్‌లు సంతాపం తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి- టెక్కలి

ఉపాధ్యాయుల బదిలీల్లో విద్యాశాఖ ప్రవేశపెట్టిన అసంబద్ధ జిఒలను విడుదల చేసిందని, దీనిని వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, వినియోగం లేని జిఒలను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పొట్నూరు జగదీష్, కురమాన దాలయ్య, గణపతి, మారం కుమారస్వామి, తమ్మినేని వైకుంఠరావు, రోణంకి విజయ్‌కుమార్, శ్రీనివాస్, ఎన్.కృష్ణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

దళిత సర్పంచ్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మేజర్ పంచాయతీ దళిత సర్పంచ్ రేగిడి లక్ష్మిపై జరిగిన దాడి అమానుషమని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. సర్పంచ్ స్వగృహానికి మంగళవారం వెళ్లి పరామర్శించి దాడికి గల కారణాలను ఆమెను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ స్పీకర్‌లో నియోజకవర్గస్థాయిలో దళితులపై దాడులు జరుగుతున్న పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈయనతో పాటు జనసేన మండల నాయకులు కొంచాడ చిన్నమనాయుడు, సూర్య, గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న రామ్మోహనరావు

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పద్మావతి డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ దుర్గాప్రసాదరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవా రం ఉదయం 10 గంటలకు విశాఖప ట్నం, హైదరాబాద్ కంపెనీలకు చెందిన అరబిందో ఫార్మా,రాణి, బ్రేక్స్ లైనేర్స అధికారులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎంఎస్‌సి, బిఎస్‌సి కెమిస్ట్రీ, ఇంటర్ ఎంపిసి, బైపిసి, ఐటిఐ, డిప్లొమా కోర్సు పూర్తి చేసి 35-45 ఏళ్ల వయసు గల పురుష అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఫార్మా రంగంలో 45 రోజులు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగు యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంకు ఖాతాలో డబ్బులు మాయం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో రెండు బ్యాంకుల్లో 20 మంది ఖాతాల నుంచి ఈ నెల 24,25 తేదీల్లో రూ.పదేసి వేలు చొప్పున విత్ డ్రా అయినట్లు బ్యాంకు అధికారులు చెప్పడంతో ఖాతాదారులు అవ్వకయ్యారు. దీంతో బాధితుడు బవర్తి రాజు సైబర్ క్రైమ్ కింద మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని యూనియన్ బ్యాంకులో తనకు అకౌంట్ ఉందని, తనకు తెలియకుండా ఖాతాలో రూ.పది వేలు విత్ డ్రా అయిందని తెలిపారు. తనలాగే మరికొంత మంది ఖాతాల నుంచి డబ్బులు విత్ డ్రా అయ్యాయని అన్నారు. దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని పోలీసులను కోరారు.

అన్నదమ్ములు కొట్లాట

మెళియాపుట్టి : మండలంలో కోదుకోలిగాంలో మనస్పర్థలు కారణంగా అన్నదమ్ములిద్దరూ కర్రలతో మంగళవారం దాడులు చేసుకున్నారు. దీంతో పైల రామారావు, పైల షణ్ముఖరావు గాయపడ్డారు. వీరిద్దరినీ ఆయా కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30న అరసవల్లి హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీల ఆదాయాలను ఈ నెల 30న లెక్కించనున్నట్లు సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి దేవాదాయశాఖ సమక్షంలో అనువంశిక ధర్మకర్త, అర్చకులు, పెద్దల సమక్షంలో తెరవనున్నట్లు పేర్కొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

పోలాకి : ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

లావేరు : లావేరు పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి చదువుతున్న 68 మంది విద్యార్థులకు తల్లిదండ్రులకు బైజ్యూస్ శ్యాంసంగ్ ట్యాబ్‌లను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. చదువుకునే విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే దిశగా సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు షేక్‌చాంద్ భాష, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజారావు, లావేరు సర్పంచ్ లక్ష్మి, ఎంపిటిసి రాధ, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ విశ్వేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎఇ అప్పన్న పాల్గొన్నారు.

పోలాకి : విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో సిఎం జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మబగాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పురపాలక బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.పద్మవల్లి అధ్యక్షతన ఎనిమిదో తరగతి విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, కమిషనర్ రమేష్, 9వ వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, 17వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి టెంక లోకేష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ, ఎంపిడిఒ, స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలుమూరు: కరవంజ మోడల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంపీపీ వాన గోపి, పాగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ దామ మన్మథరావులు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కరవంజ సర్పంచ్ జుత్తు నేతాజీ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ, పాగోడు ఎంపిటిసి రావాడ చందనబాబు, పాగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటిబాబు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ట్యాబ్‌లను చూపిస్తున్న విద్యార్థులు

కవిటి : మండలంలోని శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ ట్యాబ్‌లను అందజేశారు. సర్పంచ్ హేమలత, బాబూరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయుడు టి.రామారావు, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, కృష్ణ రౌలో, కె.గోపాల్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని జాడుపల్లి పెద్దమడి రెసిడెన్షియల్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాడుపల్లి సర్పంచ్ జనపరెడ్డి కన్నబాబు గాయత్రి, పరశురాంపురం సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ అజిత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వైకుంఠరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రామారావు, విద్యా కమిటీ చైర్మన్ ఎస్.శ్రీరాములు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: చిలకపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకలో భాగంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ ప్రతినిధి డొంక వెంకటరమణ, ఎంపిటిసి మాజీ సభ్యులు డొంక అప్పలరాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చిలక గోవింద్ మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అలాగే పాఠశాల విద్యార్థుల చిత్రాలతో తయారు చేసిన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు కోలక చిన్నమ్మడు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో ఐదు బహుమతులను గెలుచుకున్నందుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేమూరు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు దున్న సురేష్, చావలి శ్రీనివాస్, సీపాన ముకుందరావు, బొంతు రుక్మిణి పాల్గొన్నారు.

కొత్తూరు : ట్యాబ్‌లను అందజేస్తున్న సర్పంచ్ పావని

కొత్తూరు : మండలంలోని కుంటిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ అగతముది పావని ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అగతముది రంజిత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు డి.ఎల్.నరసింహులు, విద్యా కమిటీ చైర్మన్లు రమేష్, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

తల్లి మృతిపై దర్యాప్తు చేపట్టాలని ఫిర్యాదు

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడుకు చెందిన గొండు కళావతి (52) సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఆమె పెద్ద కుమారుడు మాధవరావు తన తల్లి మృతిపై అనుమానం ఉందని, దర్యాప్తు నిర్వహించాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. తాను విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నానని, సోమవారం సాయంత్రం నా తమ్ముడు గొండు వరం ఫోన్ చేసి అమ్మ మృతి చెందిందని చెప్పాడని పేర్కొన్నారు. వెంటనే బయలదేరి ఇంటికి చేరి ఎంతో ఆరోగ్యం ఉండే అమ్మ ఎందుకు మృతి చెందిందని ప్రశ్నించానని అన్నారు. మధ్యాహ్నం నిద్రించిన అమ్మ 4 గంటలు అవుతున్న లేవలేదని, లేపే ప్రయత్నం చేయగా ఒళ్లంత చల్లాగా ఉండి కదలేదని అన్నారు. దీంతో చుట్టు పక్కల వారికి పిలిచించగా వారు చూసి అప్పటికే అమ్మ మృతి చెందిందని చెప్పారని, వెంటనే నీకు తెలియజేశామని సమాధానం చెప్పడంతో నాకు అనుమానం వచ్చి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ షేక్ ఖాదర్‌బాష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి సమగ్ర రక్షిత తాగునీటి పథకం కాంట్రాక్టు కార్మికులకు 9 నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదని, ఉద్దానం నీటి పథకం కార్మికులకూ సంవత్సరాల తరబడి జీతాలు చెల్లించడం లేదని, దీంతో పస్తులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారని జిల్లా సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను మంగళవారం కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణమే జీతాలు చెల్లించాలని, లేకుంటే జనవరి 1న నుంచి సమ్మెకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు ధర్మారావు, సురేష్, అనిల్, సంతోష్, ఉమేష్, రత్నాకర్, పాపారావు, ధనుంజయ్, రమేష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- జి.సిగడాం

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనసాం సమీపంలోని నిమ్మలవలస గెడ్డపై హైలెవెల్ బ్రిడ్జిని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండిఆర్‌ప్లాన్, నాబార్డు నిధులు రూ.3.5 కోట్లు అంచనా వ్యయంతో ఈ బ్రిడ్జిని నిర్మించామని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణంలో రాజాం నుంచి రణస్థలం వెళ్లేందుకు ప్రయాణికులకు, వాహనదారులకు అనువుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మీసాల వెంకటరమణ, రొక్కం బాలకృష్ణ, కాయల రమణ, మీసాల సీతంనాయుడు, బూరాడ వెంకటరమణ, దన్నాన రాజినాయుడు, మామిడి బలరాం, బాలి అప్పలసూరి, తహశీల్దార్ పప్పల వేణుగోపాల్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి డిఇ గణపతి, ఎఇ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న శివాజీ

మాజీ మంత్రి శివాజీ పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని మాకన్నపల్లికి చెందిన తెప్పల లక్ష్మీనారాయణ ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ మృతుడు కుటుంబానికి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మందస మండలం అంబుగాంకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు ముడిమంచి లక్ష్మీనారాయణ, హరిపురానికి చెందిన మరుపల్లి శంకరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న శివాజీ వారినీ పరామర్శించారు. త్వరగా ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాక్షించారు. ఎటువంటి అవసరమైతే నా దృష్టికి తీసుకువస్తే నా వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆయన తోపాటు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, కుత్తుము మాధవరావు, రాపాక పురుషోత్తం, మందస మండలం టిడిపి ప్రధాన కార్యదర్శ లింగరాజు, రుద్రయ్య, జీవన్, నవీన్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్య భద్రత

ప్రజాశక్తి- ఆమదాలవలస

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్య భద్రత అని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యూనిసెఫ్, మెప్మా సంయుక్తంగా ఏర్పాటు చేసిన చేతుల పరిశుభ్రతా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో పెరగడం, పరిశుభ్రమైన సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, మంచి పరిశుభ్రతా విధానాల ప్రాప్యత అభివృద్ధికి మొదటి సూచీలని తెలిపారు. యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి కూడా చేతుల పరిశుభ్రతకు దాసోహమైన విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. ప్రజలు ఇప్పటికీ చేతుల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇకనైనా చేతుల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. సురక్షిత తాగునీరు, మెరుగైన పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత (వాష్) కార్యక్రమాలను ప్రజల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో యూనిసెఫ్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య ఎఇ బి.సృజన, మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, టిపిఎస్ హెచ్.వి.సత్యనారాయణ, అకౌంటెంట్ ఐ.సాయిరాం, ఎ.వి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీనివాసరావు, కె.రాజేష్‌కుమార్, జె.నాగమణి పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించి కరోనాను తరిమికొట్టాలని చైర్మన్ బల్ల గిరిబాబు పిలుపునిచ్చారు. మంగళవరం పలాస మున్సిపాలిటీలో మెప్మా విభాగంలో యూనిసెప్ ఆధ్వర్యాన వాష్ స్టేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది ఐ.బి.రము, టిఎంసి భాస్కరరావు, సిఒ స్వప్న పాల్గొన్నారు.

ఆమదాలవలస : కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిసుధాకర్

రసాయన మందులను తగ్గించాలి

కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- రణస్థలం

రైతులు రసాయనిక మందులను తగ్గించాలని, వాటిని విరివిగా ఉపయోగించడంతో కొబ్బరిలో రూగోస్ తెల్లదోమ వంటి కొత్త రకం పురుగులు ఆ మందులకు నిరోధక శక్తిని పెంచుకుంటున్నాయని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని వీరాయవలసలో కొబ్బరి తోటలను మంగళవారం పరిశీలించి రూగోస్ తెల్లదోమ నివారణకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందువల్ల రైతులు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా జీవ నియంత్రణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని రైతులకు సూచించారు. కొబ్బరిలో రూగోస్ తెల్లదోమ ప్రభావం ఇంకా పలుచోట్ల కనిపిస్తుందని, దీని నివారణకు ఐసేరియా ఫ్యూమోసెరేషియా జీవశిలీంద్రాన్ని లీటరు నీటికి ఐదు గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష అన్నారు. అవసరమైన రైతులు తమను సంప్రదించాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ సమన్వయకర్త పి.తవిటినాయుడు అన్నారు. కార్యక్రమం కొయ్యం రైతు బరోసా కేంద్రం విహెచ్ఎ డి.త్రినాథ్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు కె.మనోజ్‌కుమార్, జే.గోపాల్, రైతు కె.వెంకట జగపతినాయుడు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న భాగ్యలక్ష్మి

పుకార్లు నమ్మొద్దు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పింఛన్లు తొలగిస్తున్నామని సమాజిక మాధ్యమాల ద్వారా వస్తున్న పుకార్లను ఎవ్వరు నమ్మద్దని ఎంపిడిఒ అధికారి కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జనవరి 1 నుంచి పింఛనుదారులకు రూ.2,750 అందస్తుందని పేర్కొన్నారు. మండలానికి నూతనంగా మరో 306 పెన్షన్లు మంజూరఅయ్యాయని తెలిపారు. అలాగే ఇప్పటికే వస్తున్న పింఛన్లలో వివిధ కారణాలతో 118 మంది పింఛనుదారులకు నోటీసులు జారీ చేశామన్నారు.

అయితే వీటిపై పింఛనుదారులు ఎవ్వరు ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఇవి కేవలం వెరిఫికేషన్ మాత్రమే వచ్చాయన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు సచివాలయానికి అందజేయాలన్నారు. అలాగే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు యథావిధిగా కొనసాగుతుందన్నారు.

నేడు సర్పంచ్‌ల సమావేశం

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గ స్థాయి సర్పంచ్‌ల సమావేశం పలాస మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహిస్తున్నామని పిఎసిఎస్ చైర్మన్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష ప్రతినిధి దువ్వాడ మధుకేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు తప్పక హాజరు కావాలని కోరారు.

ముగ్గురు విద్యార్థుల ఎంపిక

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు 'కేక' అనే కంపెనీలో ఏడాదికి రూ. 8 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2022-2023లో బిటెక్ కోర్సు పూర్తిచేసిన వారికి ఈ అవకాశం దక్కింది. ఆకర్షణీయమైన ప్యాకేజీతో ఐతమ్ సిఎస్ఇ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంపై డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఫిన్సింగ్ స్కూల్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, హెబ్డి డాక్టర్ యు.డి.ప్రసన్న, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.సంతోష్‌కుమార్ ప్రశంశించారు.

ఎంపికైన విద్యార్థులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పెద్దరావుపల్లిలో గడప గడపకు...

ప్రజాశక్తి- లావేరు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదరావుపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని బయ్యన్నపేట, యాతపేట గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతి రహిత పరిపాలన అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైస్ ఎంపిపిలు లుకలాపు శ్రీనివాసరావు, అలుపన నారాయణరెడ్డి, మండల అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రైతులు

పట్టుపురం రైతుల ఆందోళన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని పట్టుపురం రైతులు సచివాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ధాన్యం తేమ శాతంలో తేడాలు ఉన్నాయని చెబుతూ తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క గిట్టుబాటు లేకపోవడంతో, మరోవైపు పొలాల్లోని వరిచేనును అడవి పందులు నాశనం చేస్తుండడంతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. 20 కిలోమీటర్ల దూరంలోని టెక్కలి మిల్లర్లకు ధాన్యం అమ్మకం చేపట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. రైతుల ధాన్యం కొనుగోలులో సరైన గిట్టుబాటు లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, మండల వాసు, దాసు, పైల కూర్మారావు, కవిటి రామస్వామి, ప్రతివాడు బుడ్డు, ప్రతివాడ వాసు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

పూండి అండర్‌పాస్ ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి అండర్‌పాస్‌ను సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీంతో పూండి పరిసర ప్రాంత ప్రజలకు రైల్వే గేట్ వల్ల ఎదురయ్యే సమస్యలు తీరుపోతాయన్నారు. రైల్వేక్రాస్ గేట్ వద్ద నిత్యం ప్రజలు అవస్థలు పడేవారని గుర్తు చేశారు. వర్షాలు కురిసే సమయంలో అండర్ పాస్‌లో నీరు చేరకుండా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం

కోళ్లను పంపిణీ చేస్తున్న ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద డ్వాక్రా సంఘాల మహిళలకు 50 యూనిట్ల పెరటి కోళ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువులు పెంపకంతో పాటు కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం సముపార్జించుకోవచ్చు అన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు వ్యవసాయ అనుబంధ యూనిట్లను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ యూనిట్లను కొత్తవలస ప్రియాంక ఆగ్రో ఫార్మ్స్ ద్వారా మండలానికి తీసుకొచ్చి అందిస్తున్నట్లు ఎపిఎం కె.జాంబవతి తెలిపారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ డిపిఎం, డిఆర్ఎం సన్యాసిరావు, ఎంఎంఎస్ అధ్యక్షులు జల్లు ఉషారాణి, సిసిఎస్ సాయిగీత, మంగమ్మ, ప్రమీల, కె.ఉషారాణి, రాంబాబు పాల్గొన్నారు.

గ్రామసభలను పక్కాగా నిర్వహించాలి

పొందూరు: మండలంలోని పలు పంచాయతీల్లో జనవరి 2 నుంచి నిర్వహించనున్న గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుమిలి రాజేష్ కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ సీపాన హరిహరరావును మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామసభల ఆవశ్యకతపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, తద్వారా ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు కాళ్లకూరి శాంతారాం, మండల అధ్యక్షులు గొలితి సంతోష్‌కుమార్, సభ్యులు నాగరాజు, రాజు, రమేష్, గంగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తులకు ఆహ్వానం

మెళియాపుట్టి : మండలంలో ఖాళీగా ఉన్న పది గ్రామ వాలంటరీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ పి.చంద్రకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. చాపర, బాణాపురం, పెద్దలక్ష్మీపురం, పడ్డ, శేఖరాపురం, సంతలక్ష్మీపురం (బిసి జనరల్), గొప్పిలి, మెళియాపుట్టి (ఎస్‌సి మహిళ), పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి 1న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లోలుగులో-2, బురిడికంచారంలో-1, పొందూరు-3, తోలాపి-1 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మిల్లర్లకు ఎటువంటి రుసుము చెల్లించవద్దు

కోటబొమ్మాళి: ధాన్యం కొనుగోలు చేసే సమయంలో రైతులు వద్ద నుంచి రైస్ మిల్లర్లు 80 కిలోల బస్తాకు రూ.50లు వరకు వసూళ్లు చేస్తున్నారని తనకు ఫిర్యాదు వచ్చిందని, అయితే రైతులు ఎవ్వరూ రైస్ మిల్లర్లకు ఒక్క రూపాయి చెల్లించ వద్దని రైతు భరోసా అడ్వైజరీ జిల్లా కమిటీ సభ్యులు కవిటి రామరాజు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోటబొమ్మాళిలోని రైస్ మిల్లుల యజమానులు ఏవో కారణాలు చెప్పి బస్తాకు రూ.50లు వసూళ్లు చేస్తున్నారని రైతులు తనకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు. మీ ధాన్యం వే బ్రిడ్జి తుకం ప్రాప్తికి వారం రోజుల్లో మీ ఖాతాలో డబ్బులు పడతాయని అన్నారు. రైతుల నుంచి డబ్బులు తీసుకుంటున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయనతో పాటు మండల రైతు భరోసా కమిటీ సభ్యులు కవిటి నర్సిమప్పడు ఉన్నారు.

ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

బూర్జ: నోటీసులు అందజేసిన పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపిడిఒ రవీంద్రకుమార్ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ తనిఖీలో అర్హులెవరూ నష్టపోరాదని సూచించారు. అలాగే కళ్యాణమస్తు పథకానికి సంబంధించి అవగాహన కల్పించాలన్నారు.

అభివృద్ధి పనులు ఏవీ?

టెక్కలి : రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం పాలన ప్రజలకు పట్టిన కర్మ అని, ఈ ఖర్మ మనకెందుకని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. మండలంలోని నర్సింగపల్లిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిని గాలికొదిలేసి ఉత్తుత్తి హామీలతో, మాటలతో పబ్బం గడుపుకుంటున్నారని విమరించారు. శాశ్వత ప్రాతిపదికన చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేవని అన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో హనుమంత రామకృష్ణ, మట్ట పురుషోత్తం, పోలాకి షణ్ముఖరావు, మామిడి రాము, కోళ్ల లవకుమార్, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, మల్లిపెద్ది మధు, కోళ్ల కామేష్, దారపు జోగారావు, పెదరట్టి మణి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ చంద్రమౌళి

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ విజ్ఞానం సాధ్యమవుతుందని, తద్వారా వారి అభ్యసన విధానంలో మార్పు వస్తుందని సరుబుజ్జిలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పార్థోజు చంద్రమౌళి అన్నారు. సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టేక్సేషన్ విద్యనభ్యసిస్తోన్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ శిక్షణలో భాగంగా బ్యాంకు లావాదేవీలపై బ్యాంకులోనే మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిజ్ఞానం పొందేలా డివిఇఒ కోట ప్రకాశరావు ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. తదనుగుణంగా ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు సూచనల మేరకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పిఒ దుగ్గివలస రాంప్రసాద్ తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో వస్తోన్న మార్పులు, డిజిటల్ బ్యాంకింగ్, వివిధ రకాల దరఖాస్తులు నింపడం, డిపాజిట్, డబ్బులు బట్వాడా చేయడం, నెఫ్ట్ ద్వారా నగదు బదిలీ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాలను చంద్రమౌళి నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గణపతి ధనుంజయరావు, లైబ్రేరియన్ రామారావు, కామర్స్ జెఎల్ సంగీత, బ్యాంకు సిబ్బంది బి.మోహనరావు, ఎం..గణేశ్వరరావు, కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

'గ్రిగ్స్' పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నందిగాం

ఈ నెల 22 నుంచి 26 టెక్కలిలో నిర్వహించిన జోన్-2 గ్రిగ్స్ పోటీల్లో నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబరిచి 24 మెడల్స్‌ను సాధించారని ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ప్రతిభ కనబరిచిన విజేతలను మంగళవారం అభినందించారు. లాంగ్ జంప్ సీనియర్ విభాగంలో 400 మీటర్ల విభాగాలో ప్రథమ స్థానాన్ని జి.అభిరాం సాధించారు. బి.మోక్ష 800 మీటర్లు, 1500 మీటర్లు, 3000 మీటర్లు ప్రథమ స్థానాన్ని పొందాడు. కె.గణేష్ ఎనిమిది వందల మీటర్ల విభాగంలో తృతీయ స్థానాన్ని సాధించాడు. 4ఇంటు100 మీటర్ల విభాగం రిలేలో దొరబాబు, పి.గోపాల్, బి.మోక్ష, జి.అభిరాములు ప్రథమ స్థానాన్ని సాధించారు. అలాగే వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు మెడల్స్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ

క్యాలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ ప్రగతికి, పురోగతికి దోహదపడే పారిశ్రామిక రంగంలో అమర్ రాజా కంపెనీ చురుకైన పాత్ర పోషిస్తోందని ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎంపీ క్యాంప్ కార్యాలయంలో అమరాన్ కంపెనీ జిల్లాశాఖ ముద్రించిన వార్షిక క్యాలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక మార్పులకు అనుగుణంగా ఉత్పత్తులు చేయడంలో అమరాన్ విజయవంతమైందన్నారు. అమరాన్ అమ్మకాల్లోనే కాకుండా సేవా రంగంలో కీలకపాత్ర పోషిస్తుందని కిరణ్ ఆటో మొబైల్స్ అధినేత, బ్యాటరీ వర్తక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.రవిశంకర్ వివరించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు, బహుదూర్ బాష, వాకర్స్ ఇంటర్నేషల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి ప్రభుత్వం వృద్ధుల, వితంతువుల సామాజిక పింఛన్ల తొలగింపు అన్యాయమని టిడిపి న్యాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు గిఫ్ట్‌గా పేదల పింఛన్లను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్‌టిఆర్‌తో ప్రారంభమైన పింఛన్ల పథకం, చంద్రబాబు హయాంలో ఒక్కసారి రూ.2 వేలు పెంచారని అన్నారు. నియోజకవర్గ పరిధిలో 1146 పింఛన్లను తొలగించారని అన్నారు. ఒక పక్క రూ.250 పెంచి... మరో పక్క తొలగింపు కార్యక్రమం చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు సంపదరావు మురళి, మాజీ కౌన్సిలర్ సనపల కొండయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాసాగర్

మారుతీ వాకర్స్ క్లబ్‌కు ఆరు పతకాలు

శ్రీకాకుళం అర్బన్ : నగరం మారుతీ వాకర్స్‌క్లబ్ ఆరు ఉత్తమ అవార్డులు దక్కాయి. సోమవారం నెల్లూరులో నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖా మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఇంటర్నేషనల్ ప్రస్తుత అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారెడ్డి, నూతన అధ్యక్షుడు ఎస్.కె.రవీంద్ర చేతుల మీదుగా ఈ అవార్డులను క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీ ధర్, కార్యవర్గ ప్రతినిధులు ఈ పురస్కారాలను అందుకున్నారు. ఉత్తమ సేవలు, కళలు, క్రీడలు, యోగా, సామాజిక అంశాలపై క్లబ్ ద్వారా అందిస్తున్న కార్యక్రమాలను మెచ్చి ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ పి.జి.గుప్తా, మాజీ గవర్నర్లు ఇందిరాప్రసాద్, కూన వెంకటరమణమూర్తి, గుడ్ల సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ భీమరాజు, మారుతీ వాకర్స్‌క్లబ్ కార్యదర్శి నాగేశ్వరరావు, సంజీవరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రఘునాథరావు

డ్రైవర్లు అప్రమత్తం

ఆమదాలవలస : సంక్రాంతి సమయంలో ప్రజలు రైళ్లలో పట్టణానికి చేరుకొని గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు, కార్లను ఆశ్రయిస్తారని, అటువంటి సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రఘునాథరావు సూచించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో డ్రైవర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామంది ప్రయాణికులు తమ బ్యాగులో పెట్టిన నగదు, బంగారం తదితర వస్తువులు పోయాయని ఫిర్యాదులు చేస్తుంటారని, అటువంటి సంఘటనలు జరగకుండా డ్రైవర్లు జాగ్రత్త వహించాలని అన్నారు. ప్రయాణికులు ఆటోల్లో లగేజ్ ఎక్కించేటప్పుడు డ్రైవర్లు సరిచూసుకోవాలన్నారు. ఏ వస్తువైనా పోయిందని ఫిర్యాదు చేస్తే డ్రైవర్లే బాధ్యత వహించాల్సి వస్తోందన్నారు. రాత్రి సమయాల్లో ఆటోలు నడిపే డ్రైవర్లకు లైసెన్సులు, వాహన సంబంధిత పత్రాలు కచ్చితంగా ఉండాలన్నారు. అధిక లోడుతో వెళ్లరాదని, డ్రైవర్‌కు కుడి, ఎడమ పక్కన ఎవరిని కూర్చోబెట్టరాదని సూచించారు. ఆటోలో ఏదైనా వస్తువును మరిచిపోయిన ఎడలా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్.వి.రమణమూర్తి, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

విద్యార్థులకు అభినందనలు

టెక్కలి: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల శ్రీకాకుళంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు టి.హారిక, ఎం.రాకేష్, ఎం.అనూషలు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు విజేతలకు కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందరావు మంగళవారం అభినందనలు తెలిపారు. వీరికి నగదు బహుమతితో పాటు, ప్రశంసాపత్రాలను అందజేశారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బేవల సతీష్‌కుమార్, లూక్ పాల్, కందిగొల్ల, ఎ.రామారావు, హేమరాజ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న వేణుగోపాల్

విద్యార్థులకు ఆర్థికసాయం

శ్రీకాకుళం అర్బన్ : తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు సిక్కోలు క్రీడాకారులు ఎంపికయ్యారు. శ్రీకాకుళం నుంచి బయలుదేరిన క్రీడాకారులకు కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు తరపున మంగళవారం ఆ సంస్థ ప్రతినిధి కొంక్యాన వేణుగోపాల్ ప్రయాణ ఖర్చులు నిమిత్తం సాయమందించారు. ఇటీవల జిల్లాస్థాయి యోగా పోటీలో వేర్వేరు కేటగిరీల కింద ఎంపికైన క్రీడాకారులకు తిరుపతి, కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతున్నారని యోగా జిల్లా కో-ఆర్డినేటర్ పి.మురళీకృష్ణ తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం పంచాయతీలో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయని సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్ అన్నారు. ఇటీవల రూ.25 లక్షల అంచనా వ్యయంతో సచివాలయం-1 భవన నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ మేరకు శ్లాబ్ పనులకు మంగళవారం శంకుస్థాన చేశారు. ఫిబ్రవరి నాటికి భవనం పూర్తవుతుందని తెలిపారు. అనంతరం శ్లాబ్ పనులను వైస్ ఎంపిపి దువ్వ వివేకానందరెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రామచంద్ర బెహరా, మాజీ ఉపసర్పంచ్ బోనమాలి బెహరా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.